

# పిడికెడు ఆకాశం

## – గొల్లపూడి మారుతీరావు



*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**సీత మురళి గురించి** మొదట్లో చెప్పగానే మాధవరావుగారికి ఒక ఆలోచన తట్టింది. శాంత పెళ్ళి విషయం. మర్నాడు అతన్ని చూసి అతని అవలక్షణాల్ని గమనించగానే అతని ఆలోచన ఆశగా మారింది. శాంతకి ఇతనే తగిన వరుడని నిర్ణయించుకున్నాడు. ఉద్యోగానికి ఉద్యోగం, అందానికి అందం ఉంది. కాకపోతే కాళ్ళకి ఉన్న కుంటు భార్యాభర్తలిద్దరికీ ఉంది. ఇద్దరికీ ఉన్న లోపాలు ఇద్దరినీ మరింత దగ్గర పరుస్తాయనుకున్నాడు. అంతకు ముందే మాధవరావు సీత కోసం ప్రతిసారీ వస్తూండడం చూశాడు మురళి.

'మా అమ్మాయిని చేసుకుంటావా?' అని మాధవరావే లౌక్యంగా కదిపినప్పుడు, వెంటనే సీత గుర్తుకొచ్చిందతనికి. తనలాంటి వానికి ముక్కూ కన్నూ తీరుగా ఉన్న అంత చక్కని అమ్మాయి లభిస్తుందని అతను కలలో కూడా అనుకోలేదు. అందుకని ఈ ప్రశ్నకు జవాబుగా వెంటనే చిరునవ్వు నవ్వేశాడు. మాధవరావుకు కొండెక్కినట్టనిపించింది. "మంచిరోజు చూసి ఇంటికి తీసుకెళ్తానులే" అని విషయం అంతటితో ఆపేశాడు. వీలయినప్పుడల్లా అతన్ని కలిసి కబుర్లు చెప్పి వెళ్తూండేవాడు. మురళికి అప్పట్నుంచే సీత మీద ఆశ ఎక్కువైంది. పదిరోజుల్నుంచీ భోజనం లేనివాడికి, మృష్టాన్న భోజ్నం చూపించి, అటక మీద మూతపెట్టినట్టు అనిపించింది. ఆ అమ్మాయితో సాన్నిహిత్యం పెంచుకోవాలనుకున్నాడు. కాని విచిత్రంగా సీత ఎదురు తిరిగేసరికి నిర్ఘాంతపోయాడు. మర్నాడు మాధవరావుతో చెపితే వెంటనే నాలిక కరుచుకున్నాడు. 'తన కూతురు' అని లౌక్యంగా ఆ విషయం అంతటితో వదిలేసిన మాట నిజమే కాని, సీత తన కూతురు కాదని చెప్పడం, కనీసం సూచించడం మరచిపోయాడని గ్రహించాడు. ఇంక ఆలస్యం చెయ్యకూడదని రెండు మూడు రోజుల్లో ఒక మంచిరోజు చూసి మురళిని ఇంటికి తీసుకొచ్చి శాంతని చూపించాడు.

శాంతని చూడగానే మురళికి వెంటనే నిరుత్సాహం కలగలేదు. సీతని గురించి ఒక ఆలోచనని స్థిరపరుచుకున్నాక దాన్ని చెరిపి దాని స్థానే మరొక దాన్ని ప్రతిష్ఠించడం కాస్త కష్టమైన పనే. కాని మురళికి శాంత ముఖం చాలా సుపరిచితమైనట్టు అనిపించింది. అతి సామాన్యంగా ఉందామె. తన అవయవ లోపం పట్ల ఎదుటివాడి జాలిని కోరే ప్రార్థన ఆ కళ్ళల్లో తోచింది. ఆ కళ్ళు, ఆ పిరికితనం, ఆ భయం ఇవన్నీ మురళికి తెలిసినవే. అవన్నీ తన ముఖంలోంచి ప్రతిఫలిస్తున్నట్టు కనిపించి అతను విస్తుపోయాడు. తనలాంటి బలహీనతలు మరొక వ్యక్తిలో సాధ్యమా అని అతను తలపోస్తూండేవాడు. కాని ఇప్పుడూ శాంత కనిపించేసరికి నివ్వెరపోయాడు. తన లోపం తెలియకుండా నలుగురి మధ్య నుంచి ఎక్కడికో పారిపోవాలన్న సిగ్గు ఆమె ముఖంలో స్పష్టంగా తెలిసింది. అక్కడ కూర్చున్నంతసేపూ తనకున్న లక్షణాలన్నీ ఆమెకి పోల్చి చూసుకున్నాడు. అందుకే ఆమె సన్నిహితురాలనిపించింది. కాని ఆవిడకున్న లోపం ఏమిటి? ఎంత

గమనించినా అతనికి అర్థం కాలేదు. కాని ఆ లోపాన్ని దాచి ఉంచ ప్రయత్నించలేదు మాధవరావు. అందుకే శాంత చేత కాఫీ తెప్పించాడు. ఆమె నడుస్తున్నప్పుడు కుంటితనాన్ని గమనించి మరీ ఆశ్చర్యపోయాడు మురళి. "అరే! అవలక్షణంలో కూడా ఇద్దరికీ పోలికలున్నాయి" అనుకున్నాడు. ఇందుకు మనస్సులో విచారం కలగకపోగా, అలాంటి మరొక వ్యక్తిని చూసినందుకు మురళికి సంతోషం కలిగింది.

తర్వాత బయటికి వచ్చాక మాధవరావు ఆతృతగా మాటలు గుప్పించాడు. "మా దురదృష్టవశాత్తూ చిన్నప్పుడే అమ్మాయి కుంటిదయింది. అయినా పనిమంతురాలు. గొడ్డులాగా చాకిరీ చేస్తుంది. చాలా బుద్ధిమంతురాలు. అన్నట్టు చెప్పడం మరిచాను. మీ ఆఫీసులోనే పనిచేస్తోందే - సీత, మాకు కావలసిన వాళ్ళే అయినా చెప్పక తప్పదు. ఆ అమ్మాయి ప్రవర్తన అంత మంచిదికాదు. ఆవిడకు చాలామంది స్నేహితులున్నారు. ఆవిడకు కావలసిన వాళ్ళూ, ఆవిడ కావలసిన వాళ్ళూ, తెలుసుగా?" నవ్వాడు మాధవరావు.

"అందుకని ఆవిడతో కాస్త జాగ్రత్తగా వుండు. నేను చెప్పానని కూడా ఎవరితో అనకు. అసలు ఈ విషయమే తెలియవలసిన పనిలేదు. ఏదో నీకు నచ్చితే మా అమ్మాయిని నీ చేతుల్లో ఉంచి నా శాయశక్తులా కట్నం ఇచ్చుకుంటాననుకో. రామా కృష్ణా అనుకుంటూ కాలం గడిపేస్తాను. మరి.. మరి బాగా ఆలోచించుకో. అమ్మాయి గుణవంతురాలు. మరి నీ మాట చెప్పు" అని ఏం జరుగుతుందా అనే వొణుకుదల గొంతులో కనిపించకుండా అన్నాడు.

మురళి నవ్వాడు. "ఇంక ఆలోచించాల్సింది లేదు" అన్నాడు.

అనుమానం కలిగింది మాధవరావుకి, "అంటే చేసుకోవా?"

"అదికాదు పిల్ల నాకు నచ్చింది. చేసుకుంటాను."

ఆ మాట వినడంతోటే రోడ్డు మీదే మురళిని ఎత్తుకుని గిరికీలు తిప్పాడు మాధవరావు. క్షణకాలం పిచ్చెత్తిపోయాడు. "చేసుకుంటావా? చేసుకుంటావా?" ఏది మళ్ళీ చెప్పు ఆ మాట. ఎన్నాళ్ళకి విన్నానయ్యా నువ్వు దేవుడివి" ఇలా నోటికి వచ్చినట్టల్లా వాగాడు. మాట్లాడీ, మాట్లాడీ చివరికి అలసిపోయి, ఇంకా సంతోషం పట్టలేక "ఉండు, చాలామందికి చెప్పాలి" అని రోడ్డుమీదే అతన్ని వదిలేసి వెనక్కి తిరిగాడు. అంతలో ఆగి త్వరలో ముహూర్తం పెట్టించేస్తాను అల్లుడూ నువ్వూ సిద్ధంకా" అని రోడ్డు మీద పరిగెత్తాడు.

23

నెల తిరక్కుండానే పెళ్ళి జరిపించేశాడు మాధవరావు. పెళ్ళి సంసారపక్షంగా జరిగినా, అసలు జరగగలిగినందుకే చాలామంది ఆశ్చర్యపడ్డారు. పెళ్ళికొడుకు లేచి నిలబడ్డప్పుడు, మంగళసూత్రం కట్టేటప్పుడు తప్ప అతని అవలక్షణాలు ఎవరికీ తెలియలేదు. అప్పుడయినా అతని అందాన్ని చూసి అందరూ ఆ లోపాల్ని మరచిపోయారు.

వర్ధనమ్మ కూడా మనఃస్ఫూర్తిగా అక్షింతలు వేసింది. కాని పెళ్ళికూతురు వెనక నిలబడ్డ సీతని చూసి ఎవరూ చూడకుండా కళ్ళు తుడుచుకుంది. సీత కనిపెట్టి 'ఏం అమ్మా ఏడుస్తున్నావ్?' అంది. వినిపించినట్టు, సీతకి కూడా గుండె ఝల్లుమంది. ఆమెకి మురళిని చేసుకోలేకపోయినందుకు విచారం లేదు. కాని శాంతకు పెళ్ళి జరిగినందుకు చాలా సంతోషించింది.

అంతా అయాక సీత శాంతని పక్కకి పిలిచి సంతోషంగా కావలించుకుంటే శాంత జాలిగా చూసింది స్నేహితురాలిని. తన సానుభూతి ఈ ప్రపంచంలో ఎవరికైనా అవసరంవుతుందని శాంత అనుకోలేదు. అందరి

సానుభూతితో తాను బ్రతకవలసి ఉంటుందని ఆమె అనుకుంది. కాని ఇవాళ మనస్ఫూర్తిగా స్నేహితురాలి పట్ల సానుభూతిని ప్రకటించింది. "నువ్వు తొందరపడకుండా ఉంటే ఈ పాటికి నీ జీవితం దారినపడేది. దురదృష్టవశాత్తూ అలా జరిగిపోయింది కాని నీకే మాణిక్యానివి" అంది.

సీతకి కన్నీళ్ళు రాలేదు. నవ్వింది. "జీవితాన్ని నాకు తోచినట్టు నడుపుకోవచ్చుననుకున్నాను. కాని ఓడిపోయాను. నాదే లోపమేమో. దాని నుంచి నువ్వేం ఆశించలేదు. బ్రతకడం తప్ప. నువ్వే జయించావు" అంది. ఆవిడకి చెప్పడం తెలియలేదు. సీత సుఖంగా బ్రతికే పెళ్ళి చేసుకోవాలని ఆశించింది. శాంత ఒక్క పెళ్ళి చేసుకోవడాన్నే ఆశించింది.

సీత కూడా పెళ్ళిలో అంతటా తనే అయి మాధవరావుకి సహకరించింది. నలుగురూ తమ గురించి చెప్పుకుంటున్నారని తెలిసి కూడా తప్పించుకుపోయింది.

పెళ్ళయిన వారంలోనే మురళికి రాజమండ్రి బదిలీ అయింది. ఆపడానికి మాధవరావు శతధా ప్రయత్నించాడు. మురళి మాత్రం గుర్నాధం దగ్గరికి వెళ్ళి మాట్లాడలేకపోయాడు. మురళి తరపున సీత వెళ్ళి విషయమంతా చెప్పింది. అయినా లాభం లేదన్నాడు గుర్నాధం. బదిలీలు ఆపే అధికారాలు పై ఆఫీసర్ల చేతుల్లో ఉంటాయి. అది తన పనికాదు. మొత్తం మీద బదిలీ ఆగలేదు. నూతన దంపతులిద్దరూ ఒక శుభముహూర్తాన ఊరికి బయలుదేరారు.

అమ్మాయిని అల్లుడితో పంపించాక మాధవరావులో చాలా మార్పు వచ్చేసింది. అంతవరకూ అలసిపోయినట్టుండే అతని ముఖం కళకళలాడింది. ఊహించలేనంత పెద్ద బరువుని దించేసుకున్న తర్వాత అనుభవించే విశ్రాంతి అతని ముఖంలో కనిపించింది. పద్దెనిమిదేళ్ళు జైల్లో ఉన్నవాడికి బాహ్య ప్రపంచంలోని ప్రతి చిన్న విషయం ఆసక్తిని కలిగించేటట్లు ప్రతి చిన్న ఆనందం, ప్రతి చిన్న వినోదం అతణ్ణి ఆకర్షించింది. ఓ రోజు తెల్లవెంట్రుకలకి రంగు వేశాడు. పెళ్ళిలోనే అత్తాకోడలంచు పంచెలు మూడు కొన్నాడు. రెండు మూడు సినిమాలు వరుసగా చూశాడు. ఊడిపోయిన పన్నుకి బదులు బంగారం పన్ను పెట్టించాడు. ఆ మధ్య అలవాటు చేసుకున్న చేతికర్ర ఇంట్లో పారేశాడు. నిరాశవల్లా, బాధ్యత వల్ల అంతవరకూ అబ్బిన వేదాంతంలోంచి నిద్రలేచిన వాడులాగా మేలుకున్నాడు. అతనికి ప్రపంచం క్రొత్తగా కనిపించింది. అందంగా కనిపించింది.

ఇదివరకులాగ ఇంట్లో వంటకి చెయ్యి కాల్చుకోవడం మానేశాడు. ఇప్పుడు గిరిజే వంట చేస్తోంది. బాగా తీరిక చిక్కింది కనక సీత ఇంటి విషయాలు కూడా చాలా నెత్తిన వేసుకున్నాడు. తనకి కూరలు తెచ్చుకొనేటప్పుడు వాళ్ళకీ తెచ్చి పెట్టాడు. తనతోపాటు వాళ్ళకీ బియ్యం వేయించాడు. ఇలాంటప్పుడు ఏదయినా కనుక్కోవలసి వస్తే ఏవిషయంలోనైనా ఆఫీసుకి వచ్చి సీతని కనుక్కుని పోతూ ఉండేవాడు. క్రమేపీ ఆఫీసు వాళ్ళు అతని రాకపట్ల విసుగు దాచుకోవడానికి ప్రయత్నించలేదు. సీత చికాకుని గమనించి వాళ్ళింకా నిర్లక్ష్యాన్ని చూపారు. ఒక్కోసారి అతను కూర్చోడానికి కుర్చీ కూడా ఇవ్వలేదు. అయినా నిలబడే చిరునవ్వుతో మాట్లాడి వెళ్ళాడు. ఒకసారి సీత మేనేజరు గదిలోకి వెళ్తే ఆమె వచ్చేవరకు ఎవరూ మాట్లాడకపోయినా, కూర్చున్నాడు. అలాంటి సమయాల్లో యిష్టాయిష్టాలు గమనించకుండానే ప్రతివాళ్ళ దగ్గరకి వెళ్ళి "ఆమె నాకు కావలసిన బంధువు, మీరంతా కనిపెట్టి ఉండండి" అని పరోక్షంగా వాళ్ళకి అంపకాలు పెట్టేవాడు. ఏ విధంగా నీకు కావలసిన బంధువని వాళ్ళు అడగలేదు. నీకేం పరవాలేదని ఎవరూ హామీ ఇవ్వలేదు. కాని మాధవరావుకి కావలసింది అవేమీ కాదు. తన రాకకి వాళ్ళు అభ్యంతరం పెట్టకుండా ఉండడం. ప్రతీసారి వాళ్ళతో జోక్యం కల్పించుకుని మాట్లాడుతూ

పలకరిస్తుండడం వల్ల ఇదివరకంత విసుగుని ప్రదర్శించలేకపోయారు గుమాస్తాలు. కాని అతని రాకని దూరం నుంచి గమనిస్తూనే 'ఆవిడకు కావలసిన వాళ్ళు వస్తున్నారోయ్' అని ఒకరిద్దరు అనడం ప్రారంభించారు ఆమెకి వినిపించేటట్టు.

ఇక తప్పనిసరిగా సీత అతనికి చెప్పవలసి వచ్చింది. "మీరు ఆఫీసుకు వస్తే బాగుండలేదు. నలుగురూ హేళన చేస్తున్నారు. మీరే అన్నారుగా రోజులు మంచివి కావని. ఏమైనా మాట్లాడాలనుకుంటే ఇంటికి ఎలాగూ వస్తున్నారాయె" అంది మెత్తగా.

అందరూ అంటున్నా, అంటున్నారని తెలిసినా ఏమీ అనుకోలేదు గాని, సీత ఈ మాట అనేసరికి "ఎంత మాటన్నావు సీత" అన్నాడు హృదయానికి తీవ్రగాయమైనట్టు. అతని ముఖం నల్లబడింది, ఒక్క క్షణం మాట్లాడలేదు. "నువ్వు ఇలా అంటావనుకోలేదు" అనేసి బయటికి వెళ్ళిపోయాడు, పిలుస్తున్నా వినిపించుకోకుండా.

ఇదంతా వింటున్న ఓ గుమస్తా తలెత్తకుండానే 'ప్రణయ కలహం కాబోలోయ్' అని ఊదాడు పక్కవాడికి.

మాధవరావు అలా చిన్నబుచ్చుకుని వెళ్ళిపోవడం సీతకి బాధగానే ఉంది. అయినా గత్యంతరం లేదు. అయితే ఇది ఇంతటితో పోలేదు. సాయంకాలం ఇంటికి వచ్చేసరికి వర్ధనమ్మ ఆమె మొహం వాచేటట్లు చీవాట్లు పెట్టింది. "అతను లేకపోతే మనం ఏమయే వాళ్ళమో ఆలోచించు. నీ నోటికి అడ్డూ, ఆపూ లేకుండా ఉంది. నలుగురి మధ్య అతన్ని అంతులేసి మాటలంటావా? మన మీద అభిమానం ఉంది కనుక సరాసరి వచ్చి నాతో చెప్పి నవ్వుకుని వెళ్ళిపోయాడు. మరొకరయితే మన మొహం చూసేవారు కాదు" అంది. అప్పుడిక మరీ బాధపడింది సీత.

మర్నాడు యథాలాపంగా మాధవరావు వచ్చినప్పుడు తల్లి ప్రోత్సాహం మీద క్షమాపణలు చెప్పుకుంది సీత.

"ఫరవాలేదమ్మా నువ్వు పసిదానివి. ఇవన్నీ మనసులో ఉంచుకుంటే మనం బ్రతకలేం. నేనేమీ అనుకోలేదులే" అనేశాడు.

ఆ తర్వాత మరెప్పుడూ ఆఫీసుకి రాలేదు.

పదిరోజుల తర్వాత ఒకరోజు గుర్నాధం సీతని తన గదిలోకి పిలిచి "మాధవరావుగారు మీకేమవుతారు?" అని అడిగాడు.

ఎందుకడుగుతున్నారో తెలీక ఆశ్చర్యపోయింది. "ఏమీ కాదు. అలా అడిగారేం?" అంది.

"ఏమీలేదు. తరచూ మా ఇంటికి వస్తున్నారాయన. ఎలాగైనా మీకు ప్రమోషన్ ఇవ్వాలని కూచున్నాడు. కనీసం జీతమైనా పెంచమంటాడు. మీరు చాలా కష్టాల్లో ఉన్నారట. ఏవేవో చెప్పాడు."

ఆశ్చర్యపోయింది.

"నిజమేనా అదంతా?"

మౌనంగా తలూపింది.

"ఎప్పుడూ మీ గురించి చెప్తాడు. మీకు బంధువేమో అనుకున్నాను. సన్నిహితుల్లో కూడా అంత మంచివారుంటారని నాకు తెలీదు" అని గొణుక్కున్నాడు.

మాధవరావు గురించి ఆలోచిస్తున్న కొద్దీ అతని మంచితనానికీ సౌహార్ద్రానికీ సీత గుండె కరిగిపోయింది. ఇక తల్లికి ఈ విషయం చెపితే ఆమె ఏడ్చేసింది. మాధవరావుతో కదిపితే "నీతో అన్నాడా ఆయన మళ్ళీ?" అని ఆశ్చర్యపోయాడు.

"ఏదోనమ్మా, నీకు కాస్త ఉద్యోగం పెరిగితే మీ కుటుంబం చక్కబడుతుందని అన్నాను. ఒకప్పుడు బాగా బ్రతికినవారాయె. నాన్నగారుంటే ఇంతకు మరింత హాయిగా బ్రతికేవారు కదూ?" అన్నాడు. అతని దయార్ద్ర హృదయానికి ఆ ఇద్దరి మనస్సులూ ఆలోడితమయ్యాయి.

"మీరెంత మంచివారు అన్నయ్యా" అంది వర్ధనమ్మ.

"నాకిలా మాటిమాటికీ కృతజ్ఞతలు చెప్తూ ఉంటే చిన్నబుచ్చుతున్నట్టుంటుందమ్మా. ఏదో పరాయివాళ్ళకి చేస్తున్నట్టు మాట్లాడతారేం? మీరంతా నాకు కావలసిన వాళ్ళనుకుంటున్నాను. నాకు చేతనైనంత చేస్తున్నాను" అన్నాడు.

సీత అతనికి కాఫీ ఇవ్వడానికి వస్తే మల్లెపువ్వుల వాసన గుప్పుమంది. ఆమె ఆశ్చర్యపోతే "ఏమిటమ్మా?" అన్నాడు.

"ఎక్కడినుంచో మల్లెపువ్వుల వాసన వచ్చింది."

"అదా! శాంత పెళ్ళిలో మిగిలిపోతే సెంటు పెట్టెలో పడేశాను. అది బట్టలకి అంటుకున్నట్టుంది" అన్నాడు సిగ్గుపడుతూ. పొరపాటున అంటుకున్న సెంటు అంత గుప్పుమంటుందా అని ఆలోచించలేదు సీత.

ఒకరోజు సాయంకాలం పని పూర్తిచేసుకుని ఇంటికి బయలుదేరబోతుంటే ప్యూను వచ్చి చెప్పాడు. "మిమ్మల్ని మేనేజరుగారు పిలుస్తున్నారు" అంటూ.

తలుపు తీసుకుని లోపలికి వెళ్ళింది సీత. గుర్నాధం పక్కనే ఉన్న కుర్చీలో ఒకావిడ కూర్చుని ఉంది. ఆవిడని చూస్తూనే ఆశ్చర్యపోయింది సీత. అంత అందాన్ని ఇదివరకెప్పుడూ చూసి ఉండలేదు. తెల్లగా దంతపు బొమ్మలాగా ఉంది. నవ్వితే కందిపోయేటట్టుగా ఉన్న చెక్కిళ్ళు. భుజం మీంచి ముందుకు జారిన పెద్ద జడ, పెదవులకి ఎర్రరంగు వేసుకుందా అనిపించింది సీతకి. కాని లేదు. ఆ పెదవుల రంగే అది. వంటి తెలుపుని వెక్కిరిస్తున్నట్టు నల్లని చీర. స్నేహాన్ని, విశ్వాసాన్ని కలిగించే నవ్వు. ఆమెని చూస్తూ నిలబడిపోయింది.

"రా సీతా" అని ఆవిడే పలకరిస్తే మరింత నివ్వెరపాటు కలిగింది.

"ఈవిడే నన్ను యెదిరించి ఉద్యోగం సంపాదించుకున్న అమ్మాయి" అని సీత వేపు తిరిగి "మా ఆవిడ" అని పరిచయం చేశాడు గుర్నాధం.

"మీరు చెప్పనక్కరలేదు. చూడగానే గ్రహించాను. మీ ధర్మమంటూ, మాధవరావుగారి ధర్మమంటూ" అంది ఆవిడ. టేబులు ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది సీత.

టేబులు మీద రెండేళ్ళ అబ్బాయి నిలబడి వస్తువులన్నింటిని చిందరవందర చేస్తున్నాడు. సిరాబుడ్డి వొలకబోశాడు. కలం నేలమీదికి విసిరాడు. డైరీ చించాడు. అయినా ప్రశాంతంగా నవ్వుతూ హాయిగా కొడుకుని చూస్తున్నాడు గుర్నాధం. ఉద్యోగుల్ని అంతగా అదిలించే గుర్నాధంలో ఈ ఓర్పు, శాంతం రహస్యంగా దాగిన గుణంలాగా కనిపించింది.

ఎన్నాళ్ళనుంచో ఎరిగిన బంధువులాగా కలుపుగోలుగా మాట్లాడింది ఆమె.

"చెప్పడం మరచిపోయాను, ఆవిడ పేరు లలిత. కానీ పెళ్ళయాక పేరు మార్చి నాకు ఇష్టమైన పేరుతో పిలుచుకుంటున్నాను. ఇప్పుడామె పేరు రాధ" అన్నాడు గుర్నాధం.

"ఊరుకోండి. ఉద్యోగులతో ఇలానే మాట్లాడతారా మీరు?" అంది రాధ కోపంగా.

"నీముందే మాట్లాడితే తప్పేముందు?" అన్నాడు.

"ఒక్క క్షణం మీరిద్దరూ కబుర్లు చెప్పుకుంటూండండి. నేను ఈలోగా పని పూర్తి చేసుకుంటూ వుంటాను. హాలుకి ఫోను చేశాను. మూడు టిక్కెట్లు రిజర్వు చేయమని. కాస్త ఆలస్యంగా వెళ్ళినా ఫరవాలేదు అన్నాడు.

"టిక్కెట్లేమిటి?" అని ఆశ్చర్యపోయింది సీత.

"సినిమాకి వెళ్తున్నాం మనం" అంది రాధ.

"నేను కూడానా?" నేను రాను."

"అదెలా? నిన్ను తీసుకెళ్ళడానికే ఈ ప్రోగ్రామంతా వేసింది. నిన్ను చూడకుండానే నువ్వంటే అభిమానం ఏర్పడింది మా ఆవిడకి" అన్నాడు. ఆ మాట అంటున్నప్పుడు భార్య మీద గల ప్రేమా, ఆప్యాయతా అంతా కళ్ళలో మెదిలింది.

వాళ్ళ అన్యోన్యతకి చాలా ముచ్చట కలిగింది సీతకి. వాళ్ళిద్దరిని చూస్తూ కూర్చుంది. సీత. రాధ లేచి సీత దగ్గరకి వచ్చింది. లేచినప్పుడు మరో విషయం తెలిసింది సీతకి రాధ తల్లికాబోతున్నదని. మనిషిలో నిండుతనానికి అది కారణమేమో. మాతృత్వం స్త్రీకి పరిపూర్ణతనిస్తుంది. హాండ్‌బాగ్‌లోని మల్లెపువ్వులు తీసి సీత వెనక్కి వచ్చి నిలబడి తురిమింది. కృతజ్ఞతతో రాధవేపు కళ్ళు తిప్పింది సీత.

"మీరు నన్నెప్పుడూ చూడలేదు. నా మీద ఎందుకింత అభిమానం?" అంది.

"ఆడదానిలో నీలాగా పొగరుగా వుండాలని నాకుండేది. నేను సాధించలేకపోయాను. సాధించిన నువ్వంటే నాకు గ్లామర్."

ఇలాంటి విషయాలు ఆడవాళ్ళు మాట్లాడుకుంటారని గుర్నాధానికి తెలియదు. వ్రాసుకుంటూనే వాళ్ళ సంభాషణకి ఒక చెవిని అప్పగించాడు.

ఇంట్లో చెపితేకాని సినిమాకి రానంది సీత.

"అయితే మీ అమ్మగారిని తీసుకువెళ్దాం" అన్నాడు గుర్నాధం.

"ఆవిడ ఎక్కడికీ రాదు."

చివరికి అంతా కలిసి కారులో ఇంటికి వచ్చి, వర్ధనమ్మతో చెప్పి సినిమాకు బయలుదేరారు.

సినిమా పూర్తయి, సీతని ఇంటిదగ్గర వదిలే సమయానికి రాధ, సీత అక్కచెల్లెళ్ళలాగా విడలేనంత సన్నిహితులయిపోయారు.

"మా ఇంటికి ఓసారి తప్పకుండా వస్తావు కదూ?" అని సీత చేత మాట తీసుకుని కారెక్కింది రాధ.

ఆ దంపతుల్ని అబ్బురపాటుతో చూస్తూ నిలబడింది సీత.

## 24

సుఖం అంటే వేరే యేమీ లేదు.

సగటు మానవుడు పక్కవాడి కష్టాల్ని పోల్చి చూసుకుని తన కష్టాలకి పెట్టుకున్న గుర్తు. అయితే రైల్లో వెడుతున్న వాడికి నేల తొందరగా పోతున్నట్టు కనిపిస్తే, దూరాన తాటిచెట్టు బద్ధకంగా వెనక్కి పోతున్నట్టు అనిపిస్తుంది. అంతమాత్రాన రైలు వేగం తగ్గినట్టుకాదు, చూపు బేధం అంతే.

ఇటువంటి సుఖాన్ని సీత అనుభవిస్తుందనే చెప్పాలి. రోజూ మామూలుగా తెల్లవారుతుంది. తమ్ముడికి పాఠాలు చెప్తుంది. ఆఫీసుకి వెళుతుంది. అవకాశం ఉన్నప్పుడు రాధ గురించి గుర్నాధాన్ని అడుగుతుంది. ఇంటికి తిరిగి వస్తుంది.

చీకట్లో రహస్యంగా ఆలోచనల్ని పరుచుకుంటుంది. కన్నీరు కారుస్తుంది. నిద్రపోతుంది. లోపల సుడిగుండాల్ని దాచుకుని కూడా ప్రశాంతంగా పారే నదిలాగా నడిచిపోతోంది సీత జీవితం.

ఒకరోజు నాగరాజు పనిగట్టుకుని ఇంటికి వచ్చాడు. ఇదివరకులాగా మాట్లాడలేకపోయాడు. తనూ పలకరించలేకపోయింది. ఎప్పుడో మరచిపోయిన పాత పరిచయస్తుల్లాగా పలకరించుకున్నారు.

"ఇప్పుడంతా అయిపోయింది కనక చెప్తున్నాను. ఆ టైపు ఇనిస్టిట్యూట్ నీకోసమే కొన్నాను. నువ్వే తీసుకుంటే సంతోషిస్తాను. దాన్ని సరిగ్గా నడపడం ఎవరికీ చేతకావడం లేదు" అన్నాడు.

నవ్వింది సీత, "అమ్మేయండి, నన్నే వదులుకున్నారు. ఇనిస్టిట్యూట్‌ని వదులుకోలేరా?" నాగరాజు సమాధానం చెప్పలేదు. ఆ మాట నిజం కాదని ఇద్దరికీ తెలుసు. కానీ ఇప్పుడు చర్చించుకోవడం వల్ల ప్రయోజనం లేదు. కొంతసేపు కూర్చుని లేచాడు. వెనుకనే సీత వచ్చింది. కారు అమ్మేసినట్టున్నాడు. కొత్తకారు ఇంటిముందు నిలబడి ఉంది.

"నీకు తెలుసా? డాక్టరుగారు ఇప్పుడు మద్రాసులో ఉంటున్నారు"

"మరి పెళ్ళి..." అని అడిగింది.

నవ్వాడు నాగరాజు. "కూతురికి కాన్సర్ అని తేలింది. మొదట డాక్టర్‌గారే ఆశ్చర్యపోయారు. వెంటనే మద్రాసు తీసుకువెళ్ళారు. తాత్కాలికంగా పెళ్ళి వాయిదా పడింది. కాని మిషనరీ తెప్పించుకుందుకు డబ్బు ఇచ్చారు."

ఆమె తెల్లబోయి చూసింది.

"నీ పెళ్ళితో జీవితం ముడిపడింది. నా వ్యాపారంతో పెళ్ళి ముడిపడింది."

కారు నెమ్మదిగా చప్పుడు చెయ్యకుండా కొండచిలువలాగా పాకుతూ వెళ్ళిపోయింది.

పండక్కి అమ్మాయి, అల్లుడూ వస్తారని తెగ అల్లరి చేశాడు మాధవరావు. రోజుకి పదిసార్లు సీత గుమ్మం తొక్కేవాడు. ఇంటిలో ఏవేం కావాలో వర్ధనమ్మనీ, అల్లుడికీ, కూతురికీ ఏమేం కావాలో సీతని వేధించుకు తినేవాడు. అయితే వాళ్ళు సంతోషంగానే సహకరించారు.

వాళ్ళు రేపు వస్తారనగా ఇక కాళ్ళు నేలమీద నిలవలేదు. ఆ రాత్రే ఇంటికి తోరణాలు కట్టించాడు. ఎక్కడిదో గ్రామఫోన్, పాతనాటకాలలోని రికార్డులు ఇంట్లో తెచ్చి పెట్టాడు.

"నువ్వు కూడా రేపు నాతో స్టేషన్‌కి రా సీతమ్మా. రైలు దిగగానే ఒక కన్నెపిల్ల వాళ్ళని పలకరిస్తే బాగుంటుంది. అదీగాక, శాంత నీ స్నేహితురాలేగా? నిన్ను చూస్తే సంతోషిస్తుంది."

కానీ సీతకి వెళ్ళాలని లేదు. ఎందుకు వెళ్ళాలని లేదో వర్ధనమ్మ గ్రహించింది. ఆమె ఇంకేం మాట్లాడలేదు. జీవితం వెక్కిరించిన దురదృష్టవంతురాలేమో, అదీగాక, మురళి పక్కనే ఉంటాడంటే మనస్సు మొరాయించింది.

"ఉన్నపాటున నాకు శెలవు దొరకదేమో? వీలైతే నేను ఆఫీసు నుంచే వస్తాలెండి" అనేసింది.

కాని మర్నాడు ఆఫీసుకు రాగానే గదిలోకి పిలిచాడు గుర్నాధం. "ఇవాళ శెలవు తీసుకో సీతా, మాధవరావుగారింటికి ఎవరో బంధువులొస్తున్నారటగా, రైలుకి టైమైంది స్టేషన్‌కి వెళ్ళు" అనేసరికి నిర్ఘాంతపోయింది.

"ఎవరు చెప్పారు?"

"మాధవరావుగారు ఉదయం ఇంటికి వచ్చారు. అతనికి ఇవాళ ఆనందంతో కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. నువ్వు దగ్గరుండాలంటాడు. అంత కావలసిన వ్యక్తి. తప్పకుండా వెళ్ళు. శెలవుకేం? అలాగే తీసుకో."

ఇక ఎదురు చెప్పలేకపోయింది. కానీ తన ఇష్టాయిష్టాలకి అతనిట్లా ఉచ్చులు బిగించడం ఆమెకు సుతరామూ ఇష్టంలేదు. కానీ అది ప్రదర్శించే సమయం, స్థలం ఇది కాదు.

కాగితాలు సర్ది, వెంటనే బయలుదేరింది రైలు స్టేషన్‌కి. కాలుకాలిన పిల్లిలాగా అటూ ఇటూ తిరుగుతూ గేటువేపే చూస్తున్నాడు మాధవరావు. "నీకోసమే చూస్తున్నానమ్మా. అమ్మాయి రావడం మాటకేం? నువ్వు రావేమోనని బెంగపట్టుకుంది."

అతని ఆతృత చూసి ఎదిరించలేకపోయింది సీత. కాని మెల్లగా అంది "దీనికోసం గుర్నాధం దగ్గరకి ఎందుకు వెళ్ళారు? నేనే అడిగేదాన్నిగా"

"పోనీలే అమ్మా. అతను మంచివాడు, ఏమీ అనుకోడు. ఉండు ప్లాట్‌ఫారం టిక్కెట్లు తెస్తాను" బయటికి వెళ్ళాడు.

సీత యధాలాపంగా పుస్తకాల షాపు దగ్గరకి వచ్చి నిలబడింది. హఠాత్తుగా అతి పరిచయమైన గొంతు పలకరింత విని తుళ్ళిపడింది. ఇటు తిరిగి, ఆ వ్యక్తిని సులువుగా పోలిక పట్టలేకపోయింది. అయినా గోపాలం గొంతు తనకి గుర్తే. ఇప్పుడు చాలా మారిపోయాడు. మనిషి బాగా బరువెక్కాడు. ముఖం గుండ్రంగా తేలి, జుత్తు వెనక్కిపోయి కాస్త వయస్సు పెరిగినట్టు తెలుస్తోంది. పెళ్ళి మగాళ్ళని ఇంత త్వరగా మారుస్తుందా అని ఆశ్చర్యమేసింది.

"బాగున్నావా సీతా?" అని పలకరించాడు.

ఆమె నవ్వింది.

ఆ నవ్వుకి అర్ధం బోధపడి అతనింకేం మాట్లాడలేకపోయాడు.

"ఎక్కణ్ణుంచి వస్తున్నారు?"

"ఇక్కడినుంచే. మా వూరు వెళ్తున్నాను."

ఇదివరకటి కంటే బాగా చిక్కినట్టు, నీరసం, కళ్ళల్లో తెగింపూ కనిపించి ఆశ్చర్యపోయాడు గోపాలం.

"నాగరాజుని పెళ్ళిచేసుకున్నావటగా?" అన్నాడు.

ఆమె తుళ్ళిపడలేదు. "ఆయన్ని కలవలేదా?"

"ఏదీ? నిన్నవచ్చాను. ఇవ్వాళ వెళ్ళిపోతున్నాను. ఎవరినీ కలవడం వీలుపడలేదు. బాగున్నాడా?"

"ఆయన కనిపించి మూడు నెలలయింది. కాబోయే మామగారు దగ్గర్నుంచి అడ్వాన్సుగా కట్నం పుచ్చుకుని ఫ్యాక్టరీని అభివృద్ధి చేస్తున్నారు. ఆయన్ని మీరు కలవవలసింది."

నిశ్చేష్టుడయాడు. "అయితే పెళ్ళి కాలేదా?" ఒక్క క్షణం ఆగి లేని నవ్వు తెచ్చుకుని "అతన్ని పెళ్ళి చేసుకోమని అడిగావటగా?" అన్నాడు.

ఆమెకు గోపాలం మీద ఎక్కడలేని కోపం, అసహ్యం ముంచుకొస్తున్నాయి. "ఏం? అడగకూడదా? మీకు అక్కరలేని వస్తువు కూడా పవిత్రంగా ఉండాలా? అడిగాను. అడగకపోవడం వల్ల ఇదివరకే నష్టపోయాను కనుక."

అతని ముఖం నల్లబడింది.

"మీకు తెలియదేమో, మీ స్నేహితుడూ మీకంటే చాలారెట్లు గొప్పవాడు. మళ్ళీ ఆయన్ని అడక్కండి. ఆయన నన్ను పెళ్ళిచేసుకోననలేదు. నేనే ఆయన్ని పెళ్ళి చేసుకోనన్నాను."

ఆశ్చర్యం ఎక్కువైంది గోపాలానికి.

"ఏం?"

"ప్రేమించిన వాళ్ళని మోసం చెయ్యడం మీ సహవాసంలో అలవాటు చేసుకున్నాను కనక."

"సీతా! ఏమైంది నీకు? ఇలా మాట్లాడతావేం?" అన్నాడు లజ్జాకులితుడయి.

ఆ మాటలకి సీత కోపమంతా జారిపోయింది. జీవితానికి లొంగిపోయిన మనిషి అతను. తను ప్రేమకు లొంగిపోయిన మనిషి ఒకప్పుడు. ఇప్పుడు తనూ జీవితానికి వశురాలైంది. కాక తప్పేదేముంది? అతని మీద జాలేసింది.

"పోనీండి. పిల్లలా మీకు?"

"కొడుకు" అన్నాడు సిగ్గుపడుతూ.

తరువాత చాలాసేపు ఇద్దరూ మౌనంగా ఉండిపోయారు. ఇంతలో రొద చేసుకుంటూ ఆశలు తీరని జీవితంలోకి మృత్యువులాగా ప్రవేశించింది రైలు.

"నేను వస్తాను" అని తొందరపడ్డాడు.

"ఉండండి" అని తొందరగా బొమ్మలు అమ్మే అబ్బాయిని నిలిపి పెద్దబొమ్మ కొంది. దాన్ని గోపాలానికి ఇస్తూ "ఇది మీ అబ్బాయికి ఇవ్వండి" అంది.

గోపాలం ఏమీ మాట్లాడలేదు. వెళ్ళబోతూ ఆగి "నన్ను క్షమించు సీతా" అన్నాడు.

"ఫరవాలేదులెండి, మీకంటే నేనేవిధంగానూ గొప్పదాన్నికాను. వెళ్ళండి త్వరగా రైల్లో మీ చోటు వెదుక్కోండి" అంది.

అతను అటువెళ్ళగానే "ఎక్కడున్నావమ్మా? రైలు వచ్చేసింది" అంటూ పరిగెత్తుకు వచ్చాడు మాధవరావు. మూర్తీభవించిన శోకదేవతలాగా ఉన్న ఆమె ముఖం చూసి నిర్ఘాంతపోయాడు.

"నేనిక్కడే ఉంటాను మామయ్యగారూ. మీరు శాంతని తీసుకురండి" అంటే ఇంకేమీ మాట్లాడకుండా ముందుకు నడిచాడు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments